క్లుప్తంగా

గేట్ పరీక్షలో ఎన్‌బీకేఆర్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న విజయకుమార్‌రెడ్డి

కోట : ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన గేట్–2025 పరీక్షా ఫలితాల్లో విద్యానగర్ ఎన్‌బీకేఆర్ మెకానికల్ విభాగం విద్యార్థులు సత్తాచాటారు. వడ్లమూడి దినేష్ ప్రొడక్షన్ ఇంజినీరింగ్‌లో 309వ ర్యాంక్, చింతమాను మహేష్ 597వ ర్యాంక్ సాధించినట్లు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. అదే విధంగా గేట్ ఇంజినీరింగ్ సైన్స్‌లో కురవ అశోక్ 939 ర్యాంక్‌ను సాధించినట్లు వెల్లడించారు. వారిని ఆయన అభినందించారు. హెచ్‌ఓడీ విక్రమ్‌కుమార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి ఆట వస్తువుల వితరణ



ఆట వస్తువులు అందజేస్తున్న ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు

గూడూరు రూరల్ : లాఫింగ్ డే సందర్భంగా గూడూరు పట్టణంలోని తూర్పువీధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు గురువారం ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఆట వస్తువులు అందజేశారు. ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ గౌరవాధ్యక్షురాలు డాక్టర్ రోహిణి మాట్లాడుతూ తమ ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న ఆట వస్తువులను సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు అందజేయాలని సూచించారు. అవి పిల్లలకు ఎంతగానో ఉపయోగపడతాయని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ తనూజ, సీడీపీవో మెహబూబి, జీవని తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన జనన, మరణ ధ్రువీకరణ పత్రాల మంజూరు

ఓజిలి: జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను త్వరితగతిన మంజూరు చేయాలని ఎంపీడీవో విజయలక్ష్మి ఆదేశించారు. ఆమె గురువారం ఇంటర్ డిపార్ట్‌మెంటల్ కోఆర్డినేషన్ కార్యక్రమంపై వైద్యసిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడారు. గ్రామాల్లో ఎవరైనా మరణించినా, జన్మించినా ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది వెంటనే పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యదర్శి వారి కుటుంబ సభ్యులకు 21 రోజుల్లో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారని వివరించారు. 21 రోజులు దాటితే డీఎంహెచ్‌వో, ఆర్డీవో కార్యాలయాలకు వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సీడీపీవో ఉమామహేశ్వరి, వైద్యాధికారిణి హిమజ, వైద్యులు మాధవ్, డేనియల్‌రాజు, సీహెచ్‌వో సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు

చిల్లకూరు : రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు వీఆర్వోలను ఆదేశించారు. ఆయన గురువారం వీఆర్వోలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యేక గ్రీవెన్స్‌తో పాటు రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. కడివేడు రెవెన్యూ పరిధిలో చేపట్టిన రీసర్వేపై నివేదికలు వెంటనే ఇవ్వాలన్నారు. ఆర్‌ఐ పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

యంత్రాలతో ఉపాధి పనులు

చిల్లకూరు : మండలంలోని తిమ్మనగారిపాళెంలో చేస్తున్న ఉపాధి పనుల్లో యంత్రాలను వినియోగించినట్లు గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నాలుగు రోజుల క్రితం గ్రామానికి చెందిన ఒక రైతు పొలంలో ఫారం పాండ్ పనులు చేసి ఆన్‌లైన్‌లో మస్టర్లు అప్‌లోడ్ చేశారు. దీనిపై గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. కూలీలతో పనులు చేయించకుండా యాక్టివ్ మేట్‌గా పనిచేస్తున్న వ్యక్తి పక్క గ్రామానికి చెందిన జేసీబీని తీసుకువచ్చి ఫారంపాండ్ తవ్వించాడని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్ ఆ ప్రాంతంలో విచారణ చేపట్టారు. పొలంలో ఉన్న మొక్కలను తొలగించేందుకు తన సొంత నిధులు వెచ్చించి జేసీబీని పిలిపించినట్టు రైతు తెలిపారు. దీనిపై ఏపీవో గిరిబాబును వివరణ కోరగా యంత్రాలతో పనిచేసినట్టు గుర్తించామన్నారు. ఈ పనిని కూడా మస్టర్లో నమోదు చేయాలని ఆదేశించినట్టు పేర్కొన్నారు. ఆడిట్ సమయంలో తనిఖీ బృందాలు దీనిపై విచారణ చేస్తారని వివరించారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

సూళ్లూరుపేట : దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న నాయుడుపేట మండలం వేమగుంటపాళెంకు చెందిన రామసుబ్బయ్యకు సీఎం సహాయనిధి నుంచి వచ్చిన రూ.1,14,325 చెక్కును గురువారం టీడీపీ తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి అందజేశారు. రామసుబ్బయ్య పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారని, ప్రస్తుతం అనారోగ్యంతో బాధపడుతున్నట్టు వేనాటి సతీష్‌రెడ్డి రాష్ట్ర విద్యాశాఖా మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి సీఎం సహాయ నిధి నుంచి సాయం అందించేలా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో కేవీరెడ్డి, వేనాటి జనార్దన్‌రెడ్డి, నాయుడుపేట రూరల్ అధ్యక్షుడు కామిరెడ్డి అశోక్‌కుమార్‌రెడ్డి, లింగారెడ్డి బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో కాళంగి గ్రాయిన్

ప్రపంచంలోనే అతిపెద్ద ఉప్పునీటి సరస్సుగా పులికాట్ గుర్తింపు పొందింది. దాని ముఖ ద్వారంలో కాళంగి నది ఉంది. నదిలో నీటి ప్రవాహం లేని సమయంలో పులికాట్‌లోని ఉప్పునీరు అందులోకి చేరకుండా ఉండేందుకు కాళంగి గ్రాయిన్‌ను నిర్మించారు. ప్రస్తుతం అది శిథిలావస్థకు చేరింది. దీంతో ఉప్పునీటి కలుస్తుండడంతో కాళంగి నది నీరు ఉప్పుగా మారి పంటలకు, ప్రజలు తాగడానికి వీలుకాని పరిస్థితి నెలకొంది. బావులు, బోర్లలోని నీరు సైతం ఉప్పుగా మారడంతో ప్రజలు లబోదిబోమంటున్నారు. అధికారులు, పాలకులు స్పందించి కాళంగి గ్రాయిన్‌ను పునఃనిర్మించాలని కోరుతున్నారు.

- ఎగబాకుతున్న పులికాట్ సరస్సు ఉప్పునీరు
- వర్షాకాలంలో వరదలు
- వేసవిలో కరువు కాటకాలు



గ్రాయిన్ కొట్టుకుపోవడంతో నదిలోకి చేరుతున్న పులికాట్ సరస్సు ఉప్పునీరు

తడ: దొరవారిసత్రం, సూళ్లూరుపేట మండలాల గుండా ప్రవహించే కాళంగి నది తడ సమీపంలోని పులికాట్ సరస్సు వద్ద సముద్రంలో కలుస్తుంది. కాళంగినది నీటిని ఆధారంగా చేసుకుని పరివాహక ప్రాంతాల్లో సుమారు 5 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారు. అలాగే సూళ్లూరుపేట పట్టణంతో పాటు వాటంబేడు నుంచి మన్నారుపోలూరు చెల్లెమ్మ బొంద దాకా వున్న బావులు, బోర్లను ఆధారంగా చేసుకుని పంటలు పండించుకుంటున్నారు. సూళ్లూరుపేట పట్టణంలో సుమారు 90 వేలు, పల్లెల్లో మరో 10 వేలు, షార్ కాలనీల్లో 6 వేల మందికి పైగా బోర్ల ద్వారా తాగునీటిని అందిస్తున్నారు. ప్రస్తుతం బోర్లు, బావుల్లోని నీరు ఉప్పుగా మారడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పసల పెంచలయ్య హయాంలో..

1992లో పసల పెంచలయ్య మంత్రిగా వున్నప్పుడు ప్రపంచ బ్యాంకు నిధులతో వాటంబేడు సమీపంలోని పులికాట్ సరస్సులో కాళంగి నది కలిసే ప్రాంతంలో గ్రాయిన్ నిర్మాణం చేపట్టారు. అప్పట్లో దీనికి మంజూరైన నిధులు చాలకపోవడంతో బొంతరాళ్లతో గ్రాయిన్ నిర్మించి వదిలేశారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం దీని గురించి పట్టించుకోలేదు. 2001లో తుపాను దాటికి గ్రాయిన్ తెగిపోయి ఉప్పునీరు పైకి ఎగబాకింది. వాటంబేడు, చేనిగుంట, గ్రద్దగుంట రైతులు ఇసుక బస్తాలు వేసి కొంతమేర నష్టాన్ని తగ్గించుకున్నారు. 2004 నుంచి 2014 వరకు అధికారంలో వున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గ్రాయిన్ గురించి పట్టించుకోలేదు.

2016లో తూతూమంత్రంగా పనులు...

2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.35 లక్షలతో తూతూ మంత్రంగా పనులు చేసింది. మూన్నాళ్లకే గ్రాయిన్ కొట్టుకుపోయింది. 2019లో అప్పటి ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఇరిగేషన్ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ గ్రాయిన్ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. తొలుత రూ.8.3 కోట్లు మంజూరు చేశారు. తర్వాత అంచనాలను సవరించి రూ.11 కోట్లు కేటాయించారు. కాంట్రాక్టర్ సకాలంలో పనులు చేపట్టకపోవడం, అంతలోనే వరదలు రావడం, ఎన్నికల కోడ్‌తో పనులు ముందుకు సాగలేదు. తాజాగా రూ.24.8 కోట్లతో మరోసారి అంచనాలు తయారు చేశారు. ఈ పనులైనా పట్టాలెక్కుతాయా అని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



2016లో బొంతరాళ్లతో గ్రాయిన్‌కు మరమ్మతులు చేస్తున్న రైతులు(ఫైల్)



ఉప్పు నీటితో పంటలు పండక బీడుగా మారిన వందలాది ఎకరాల పొలాలు



భారీ వర్షాలకు వరద ప్రవాహంతో పోటెత్తిన కాళంగి నది(ఫైల్)

తాగునీరు ఉప్పుగా మారిపోయింది.



వాటంబేడు వద్ద వున్న గ్రాయిన్ నుంచి ఉప్పునీరు పైకి ఎగబాకడంతో కాళంగి నది నీరు కూడా ఉప్పుగా మారిపోయింది. సూళ్లూరు ప్రాంతంలో తాగునీటి బోర్లు, బావుల్లోని నీరు ఉప్పుగా మారింది. సూళ్లూరుపేటకు ఉప్పునీటి బెడద తప్పడం లేదు. ఈ ఏడాదైనా గ్రాయిన్ నిర్మాణం పూర్తి చేయాలి.
– వంకా చంద్రశేఖర్, సూళ్లూరు

30 ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నాం



నాకు 10 ఎకరాల పొలం వుంది. కాళంగి నది నీటితో వరి సాగు చేసేవాళ్లం. ఇప్పుడు ఉప్పు నీరు వస్తుండడంతో పంటల సాగుకు పనికిరావడంలేదు. ఏటిలో ఆయిల్ ఇంజిన్లు పెట్టుకుని నీళ్లు తోడుకుని పంటకు పెట్టుకుట్టామంటే ఉప్పునీరుగా మారిపోయింది. గ్రాయిన్‌ను పునఃనిర్మిస్తే సమస్య తీరుతుంది.
– గండవరం సురేష్‌రెడ్డి, గ్రద్దగుంట

పనులు పూర్తి చేసి రైతులను ఆదుకోవాలి



మేము నిధులు మంజూరు చేయించినా కాంట్రాక్టర్ వల్ల పనులు చేపట్టలేక పోయాం. వానాకాలం వచ్చేలోపు పనులు పూర్తి చేసి రైతులకు ఉప్పునీటి సమస్య తొలగించాల్సిన అవసరం ఉంది. వరదతోపాటు వేసవిలో ఉప్పునీటి సమస్యతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వారికి భరోసా కల్పించాలి.
– కిలివేటి సంజీవయ్య, మాజీ ఎమ్మెల్యే, సూళ్లూరుపేట

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని గ్రాయిన్ పటిష్టంగా నిర్మించేలా రూ.24.80 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. అనుమతి వచ్చిన వెంటనే టెండర్లు పిలిచి పనులు మొదలు పెడతాం. గ్రాయిన్ ఏర్పాటు చేసే ప్రాంతంలో నదికి ఇరువైపులా పోర్లుకట్టలను కాంక్రీట్ వాల్‌తో పటిష్టం చేస్తాం.
– రమేష్, ఇరిగేషన్ ఏఈ, సూళ్లూరుపేట

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు

వెంకటగిరి రూరల్ : వెంకటగిరిలో ఉన్న ఏపీఆర్‌ఎస్ పాఠశాల, జూనియర్ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శారదబాయి తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో అన్ని సీట్లు, 6, 7, 8 తరగతుల్లో మిగిలిన సీట్లను భర్తీ చేస్తున్నట్టు తెలిపారు. అలాగే ఏపీఆర్‌జేసీ అండ్ డీసీ 2025 ఇంటర్, డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెలాఖరులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 25న జిల్లా ప్రధాన కేంద్రంలో ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 87126 25075లో సంప్రదించాలని సూచించారు.

24న ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఓజిలి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 24వ తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉదయం 9 గంటల నుంచే అధికారులు కార్యాలయంలో ఉండి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని వెల్లడించారు.

ఏప్రిల్ 3 నుంచి అమీర్ షావలీ దర్గా ఉరుసు



ఉరుసు ఫ్లెక్సీలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలో ఉన్న హజరత్ అమీర్‌షావలీ దర్గా ఉరుసును ఏప్రిల్ 3 తేది నుంచి మూడు రోజులు ఘనంగా నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. వారు గురువారం ముజావర్లు, యువకులతో కలిసి ఉరుసు ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఏప్రిల్ 3వ తేదీ రాత్రి గంధం ఊరేగింపు, 4వ తేదీ తెల్లవారుజామున దర్గా వద్ద భక్తులకు గంధం పంపిణీ, రాత్రి సినీ పాట కచేరి, 5వ తేదీ మధ్యాహ్నం అన్నదానం, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలు



మాట్లాడుతున్న కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ వరలక్ష్మి

సూళ్లూరుపేట : విద్యార్థులు క్రమశిక్షణ, కృషి పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలు సాధించవచ్చని టాటా కెమికల్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ వరలక్ష్మి తెలిపారు. సూళ్లూరుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం తడ మండలం మాంబట్టు సెజ్‌లో వున్న టాటా కెమికల్ కంపెనీ ప్రతినిధులు విద్యార్థులకు ఉపాధి అవకాశాలు–నైపుణ్య శిక్షణ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎల్‌బీ శంకరశర్మ మాట్లాడుతూ ప్రస్తుతం విద్యతో పాటు నైపుణ్యం వుంటేనే మంచి ఉద్యోగాలు వస్తాయన్నారు. టాటా కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ వరలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసి వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ఇలాంటి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు సతీష్, శ్రావణ్, కెరీర్ గైడెన్స్ సెల్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసులు, అకాడమిక్ కోఆర్డినేటర్ డి.ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిలో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు



సామాజిక తనిఖీ ప్రజావేదికలో పీడీ శ్రీనివాస ప్రసాద్ తదితరులు

నాయుడుపేట టౌన్ : ఉపాధి పనుల్లో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ హెచ్చరించారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో గురువారం ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో 2023–24లో మొత్తం రూ.10.19 కోట్లు ఖర్చు చేసి 535 పనులు చేసినట్లు తెలిపారు. వీటిపై సోషల్ ఆడిట్ సిబ్బంది ఈనెల 1 నుంచి 17 వరకు తనిఖీ చేసినట్లు తెలిపారు. కూచివాడ గ్రామంలో స్వర్ణముఖి నదిలో నిబంధలనకు విరుద్ధంగా రూ.20 లక్షలకు పైగా ఖర్చు చేసి ఉపాధి పనులు చేసినట్లు తేలిందన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తామన్నారు. అనంతరం రికార్డులు సక్రమంగా రాయకపోవడం తదితర కారణాలతో ఏపీవో, ఎఫ్ఏలు, టీఏలు, ఈసీ, సిబ్బందికి రూ.20,426 జరిమానా విధించారు. రూ.61,260ల రికవరీకి ఆదేశించారు. ఎంపీడీవో సురేష్‌బాబు, సోషల్ ఆడిట్ అధికారులు, ఉపాధి హామి ఎఫ్ఏలు, టీఏలు, ఈసీ పాల్గొన్నారు.

తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వినతి

అధికార పార్టీ నేతల ఒత్తిడితో తమను ఏపీవో తొలగించారని, తిరిగి విధుల్లోకి తీసుకోవాలని తొమ్మిది ఫీల్డ్ అసిస్టెంట్లు కోరారు. తమతో ఏపీవో బలవంతగా రాజీనామాలు చేయించారని వాపోయారు. తాము ఎలాంటి తప్పూ చేయలేదన్నారు. మండలంలో అక్రమంగా తొలగించిన ఎఫ్ఏలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మీ పీడీని కోరారు.

ఘనంగా ప్రపంచ పిచ్చుకల దినోత్సవం



మాట్లాడుతున్న ఎఫ్‌బీవో దొరసానమ్మ

సూళ్లూరుపేట రూరల్ : సూళ్లూరుపేట మండలంలోని కోటపోలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం డీఎఫ్‌వో హారిక ఆధ్వర్యంలో ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎఫ్‌బీవో దొరసానమ్మ మాట్లాడుతూ పిల్లలు విద్యార్థి దశ నుంచే పిచ్చుకలు, పక్షుల మనుగడపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పిచ్చుకల సంఖ్యలో రోజురోజుకూ తగ్గిపోతోందని, వాటిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు ఇంద్రజిత్, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత ముడిసరుకుల ధరలు తగ్గించాలి

వెంకటగిరి (సైదాపురం) : చేనేత ముడి సరుకుల ధరలు తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కందారపు మురళి డిమాండ్ చేశారు. ఆయన గురువారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వెంకటగిరి పట్టణంలోని బంగారుపేట 1, 2, 3 వార్డుల్లో ప్రజా చైతన్యయాత్ర చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పట్టు, పేక, నూలు ధరలు పెరగడంతో చేనేత మగ్గాలు నడవక కార్మికులు పస్తులు ఉంటున్నారని తెలిపారు. నెలలో 15 రోజులు కూడా పనులు ఉండడం లేదన్నారు. నేత కార్మికులకు నెలకు 200 యూనిట్లు కరెంటు ఉచితంగా ఇస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నియోజవర్గ కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య, నాయకులు ఐలా భాస్కర్, సుబ్బరాయులు, చంద్రశేఖర్, రత్నమ్మ, నారాయణ, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్ల సస్పెన్షన్

వాకాడు : ఉపాధి హామీ కింద చేసిన పనులపై గురువారం డ్వామా పీడీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వాకాడులో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. పనుల్లో అవకతవకలకు పాల్పడిన ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేశారు. కల్లూరు, ముట్టెంబాక గ్రామంలో చేసిన ఉపాధి పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు శ్రీనివాసులు, పరుశురామయ్య నిర్లక్ష్యంగా వ్యవహరించారని కూలీలు ఫిర్యాదు చేశారు. దీనిపై పీడీ శ్రీనివాసులు పరిశీలించారు. వారిని సస్పెండ్ చేశారు. ఇందులో ఏపీవో విజయమ్మ నిర్లక్ష్యం కూడా ఉన్నట్టు గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఇలాంటి పునరావృతమైతే వేటు తప్పదని ఆమెను హెచ్చరించారు. సస్పెండైన కల్లూరు, ముట్టెంబాక ఫీల్డ్ అసిస్టెంట్లు, వాకాడు ఫీల్డ్ అసిస్టెంట్‌పై వచ్చిన ఫిర్యాదులపై గ్రామాల్లో విచారణ చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని పీడీ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ వరప్రసాద్, ఎంపీడీవో శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

చీరల పంపిణీ

గూడూరు రూరల్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని గూడూరు పట్టణం దర్గా ప్రాంతంలో గురువారం లయన్ షేక్ రియాజ్ అహ్మద్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం 100 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరూ పేదలకు సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో దర్గా వెల్ఫేర్ కమిటీ సభ్యులు మగ్దూమ్ మొహిద్దీన్, షేక్ ఇలియాజ్ అహ్మద్, హఫీజ్, మహ్మద్‌హుస్సేన్, కాలేషా, ఛాన్‌బాషా పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

గూడూరురూరల్: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు గూడూరుకు చెందిన యనమల బాలకృష్ణ(40)గా గుర్తించారు. రైల్వేలో కీ మెన్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో మృతిచెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని గూడూరు ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దొరవారిసత్రంలో..

దొరవారిసత్రం: దొరవారిసత్రం రైల్వేస్టేషన్‌కు సమీపంలో గురువారం రైలు ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. జీఆర్పీ పోలీసుల కథనం మేరకు.. రైల్వేస్టేషన్ సమీపంలోని డౌన్‌లైన్ పట్టాలపై రైలు ఢీకొనడంతో వృద్ధుడు(60) తీవ్రంగా గాయపడ్డాడు. రైల్వే గ్యాంగ్ సిబ్బంది అతన్ని 108లో నాయుడుపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. అతను గొల్లపాళెంకు చెందిన వ్యక్తి అని సమాచారం. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్ఐ మాలకొండయ్య తెలిపారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



పోలీస్ స్టేషన్ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ సురేష్‌బాబు

చిల్లకూరు : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేలా రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు. చిల్లకూరు పోలీసు స్టేషన్, వరగలి క్రాస్ రోడ్డు, గూడూరు ఆర్టీసీ బస్టాండ్, పాత బస్టాండ్, కోర్టు సెంటర్‌లో గురువారం చేడిమాలకు చెందిన రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చలివేంద్రాలు ప్రారంభించారు. ట్రస్టు ప్రధాన కార్యదర్శి రామానాయుడు మాట్లాడుతూ ప్రతిఏటా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం వెంకటేశ్వర్లు, ట్రస్టు ప్రతినిధులు బాబు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు



వర్ధనపల్లి వద్ద లారీని ఢీకొన్న కారు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

- మహిళ మృతి
- నలుగురికి తీవ్ర గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం

వెంకటగిరి రూరల్: మండలంలోని వర్ధనపల్లె వద్ద గురువారం రోడ్డు పక్కన ఆగివున్న లారీని కారు ఢీకొంది. పోలీసుల కథనం మేరకు.. వర్ధపల్లికి చెందిన పడదాల రత్నమ్మ, కుమారుడు వెంకటకృష్ణయ్య ధాన్యాన్ని లారీలో లోడ్ చేస్తున్నాడు. నెల్లూరు నుంచి వెంకటగిరి వైపు వస్తున్న కారు అదుపుతప్పి లారీని ఢీకొంది. దీంతో పడదాల రత్నమ్మ(60), వెంకటకృష్ణయ్య, వెంకటేశ్వర్లు, కారులో ఉన్న శివకుమార్, కళ్యాణ్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు 108లో వెంకటగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రత్నమ్మ మృతి చెందింది. శివకుమార్, కళ్యాణ్‌రెడ్డిని నెల్లూరు నగరానికి తరలించారు. వెంకటగిరి ఎస్ఐ సుబ్బారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

వాకాడు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం దారా అజయ్‌కుమార్ చల్లని మజ్జిగ, లస్సీ పంపిణీ చేశారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మజ్జిగ ప్యాకెట్లు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థిని చదువుకు ఆర్థిక సాయం



విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

వాకాడు : మండలంలోని బాలిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన సీతారామ ధార్మిక సేవా సంస్థ ప్రతినిధులు గురువారం కాలా చండీశ్వరి అనే పేద విద్యార్థినికి ఆర్థిక సాయం అందించారు. ఆ మొత్తాన్ని కోన చంద్రమౌళి, హైమావతి దంపతులు ఇచ్చారు. బాలిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు అనంతాచార్యులు, హరీష్‌రెడ్డి, నరేంద్ర, వంశీ పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపుపై కొరవడిన ప్రచారం



బోసి పోయి ఉన్న గ్రామసచివాలయం

కలువాయి(సైదాపురం) : మండలంలోని కుల్లూరు సచివాలయంలో ఏర్పాటుచేసిన ఆధార్ క్యాంపు గురించి ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. దీంతో క్యాంపునకు ఎవరూ రాలేదు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలల్లో చేరే పిల్లలకు ఆధార్ కార్డులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని ఆధార్ కార్డులు మంజూరు చేసేందుకు క్యాంపు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. కుల్లూరు గ్రామ సచివాలయంలో ఏర్పాటుచేసిన క్యాంపు గురించి ప్రచారం చేయలేదు. ఎంపీడీవో భవాని పత్రికలో ప్రకటన ఇచ్చి సరిపెట్టుకున్నారు. దీంతో క్యాంపునకు ఎవరూ రావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్యాంపుపై ప్రచారం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుత్ అదాలత్‌కు 15 అర్జీలు

కోట: విద్యానగర్‌లోని విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విద్యుత్ అదాలత్‌కు 15 అర్జీలు వచ్చినట్టు ఈఈ నరేంద్రరెడ్డి తెలిపారు. కోట సబ్‌డివిజన్ పరిధిలోని కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన వినియోగదారులు పాల్గొన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యుత్ అదాలత్ సభ్యులు శ్రీనివాసఅంజనేయ మూర్తి, రామ్మోహన్‌రావు, అంజనీకుమార్, ఏడీ చిన్నయ్య పాల్గొన్నారు.

దారి ఆక్రమణపై ఫిర్యాదు

చిట్టమూరు : మండలంలోని అనగొల్లపాళెం వెళ్లే దారిని ఆక్రమించారని గ్రామస్తులు ఆరోపించారు. వారు గురువారం తహసీల్దార్ కాయల సతీష్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ తాతల కాలం నుంచి సూళ్లూరుపేట–కోట రోడ్డు నుంచి గ్రామానికి దారి ఉందన్నారు. భూస్వాములు దారిని ఆక్రమించుకుని కంచె వేసేందుకు సిద్ధమయ్యారని పేర్కొన్నారు. సర్వే చేసి దారిని కాపాడాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ సర్వే చేయించి దారి ఉంటే ఆక్రమణను తొలగిస్తామని హామీ ఇచ్చారు.